క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన 18 మంది ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం శ్రీవాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇక్కడ విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు.

మరుగుదొడ్ల నిర్వహణ భేష్



తాంటిగుంటపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

సదుం: స్థానిక పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రా ల్లో మరుగుదొడ్ల నిర్వహణ బాగుందని కేంద్ర బృందం అధికారి రాజేష్ కితాబిచ్చారు. కేంద్ర బృందం శుక్రవారం తాటిగుంటపాళ్యం గ్రామ పంచాయతీలో పర్యటించింది. పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, తడి, పొడి చెత్త నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగంపై పరిశీలించింది. పంచాయతీలో పాఠశాలలు, ప్రార్థన మందిరాలు, ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాలు బాగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిబాబు, సర్పంచ్ యల్లప్ప, కార్యదర్శులు జనార్ధన్, మోహన్, రోజా తదితరులు పాల్గొన్నారు.

మంచినీటికి ఇబ్బందిగా ఉంది సారూ!



సమస్యలను తెలుపుతున్న విద్యార్థిని

పలమనేరు: 'మా పాఠశాలలో తాగునీటి ఇబ్బందిగా ఉంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరైనా చర్యలు తీసుకోండి' అని పలమనేరు సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలను శుక్రవారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు సందర్శించారు. విద్యార్థినులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఇక్కడ మొత్తం 640 మంది విద్యార్థినులు వున్నట్టు తెలిపారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత



చికిత్సపొందుతున్న వెంకటరమణ

చౌడేపల్లె: మండలంలోని 29 ఏ చింతమాకుల పల్లె పంచాయతీ పిఎల్ కొత్తూరులో శుక్రవారం పాముకాటుతో వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. గ్రామానికి చెందిన వెంకటరమణ(55) మామిడి తోటలో కాపలాగా ఉన్నాడు. ఆయన శుక్రవారం మామిడి తోటలో తిరుగుతుండగా పాము కాటేసింది. అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబ సభ్యులు 108లో పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

21న చలో విజయవాడ

చిత్తూరు కార్పొరేషన్: తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్–2 ఉద్యోగులు తెలిపారు. వారు శుక్రవారం ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అందరికీ ఒకే రకమైన సర్వీసు రూల్స్ అమలు చేయాలన్నారు. కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలన్నారు. సచివాలయ ఉద్యోగులతో సమానంగా సెలవులు, జీతభత్యాలు ఇవ్వాలని కోరారు. హరి, విజయ సారథి పాల్గొన్నారు.

ఉపాధిలోనూ పచ్చనేతల అక్రమాలు







పలమనేరు మండలంలోని పలు గ్రామాల చెరువుల్లో జేసీబీల ద్వారా పాత పనులకే నగిషీలు

కూటమి నేతలు అధికారం అండతో రెచ్చిపోతున్నారు. కూలీలకు ఉపాధిని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పాత గుంతలను జేసీబీలతో తవ్వి వాటికి నగిషీలు చెక్కుతున్నారు. కూలీలే పనులు చేసినట్టు రికార్డులు సృష్టించి బిల్లులు చేసుకుంటున్నారు. తద్వారా కూలీల నోట్లో మట్టి కొడుతున్నారు. అలాగే పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెల పనుల్లోనూ చేతివాటం చూపారు. వారికి ఉపాధి సిబ్బంది, అధికారులు సహకారం అందించడం గమనార్హం.

- గతంలో చేసిన పనులకు జేసీబీలతో నగిషీలు
- కూలీలతో చేసినట్టు ఫేసియల్, ఫొటోలు
- సహకరిస్తున్న అధికారులు
- కూలీల నోట్లో మట్టికొడున్న పచ్చనేతలు

పలమనేరు/పుంగనూరు (చౌడేపల్లె): పలమనేరు నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా 90 పంచాయతీలు, 520 గ్రామాలు వున్నాయి. జాబ్ కార్డులున్న కూలీలకు ప్రభుత్వం ఉపాధి పనులు కల్పిస్తోంది. ఒక్కో కుటుంబానికి వంద రోజులకు తక్కువ కాకుండా పనిదినాలు కల్పించాల్సి వుంది. గ్రామ సభలు నిర్వహించి అవసరమైన పనులను గుర్తించాలి. ఈ తీర్మానాన్ని సంబంధిత పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు ఆమోదించాలి. ఆపైన ఉపాధి సిబ్బంది జాబ్ కార్డులున్న వారికి పనులు కల్పించాలి. అధికారులు పనులను పర్యవేక్షించాలి. ప్రతిరోజూ పనులకు హాజరైన వారి వివరాలను మస్టర్‌లో నమోదు చేయడంతోపాటు జీపీఎస్ ఆధారంగా ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలి. వారికి వారంలో కూలీలు అందేలా చర్యలు తీసుకోవాలి. కూటమి నేతలు ఉపాధి అధికారులతో కుమ్ముక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం చేస్తున్న పనుల్లో 80 శాతం దాకా నిధులను బొక్కేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

ప్రస్తుతం ఉపాధి కింద కేంద్ర ప్రభుత్వం వివిధ పనులు చేయడానికి రూ.5 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. వాటితో ఫారంపాండ్స్ తవ్వకాలు, చెరువుల్లో పూడికతీత, పొలాలకు బంకమట్టి తరలింపు, క్యాటిల్ షెడ్లు, మొక్కల పెంపకం, పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణ పనులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. హార్టికల్చర్‌లో మొక్కలు నాటామంటూ గతంలో పాదులు చేసిన వాటిని కూలీల ద్వారా ఫొటోలు తీసి బిల్లులు చేసుకుంటున్నారు. సప్లయి చానెళ్లు, ఫారంపాండ్స్ తదితరాలను జేసీబీలతో తవ్వి కూలీలు చేసినట్టు రికార్డులు సృష్టిస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంలో ఉపాధి పనులు కూటమి నేతలకు డబ్బులు కురిపించే ఏటీఎంలుగా మారాయి. అక్రమాల ద్వారా వచ్చిన డబ్బులో కొంత బినామీ కూలీలకు, మరి కొంత ఉపాధి సిబ్బందికి మిగిలిన సింహ భాగం నేతలకు దక్కుతున్నట్టు తెలుస్తోంది. యంత్రాలతో చేసిన పనులు నగిషీలు చేసేందుకు ప్రత్యేక కూలీలు, బిల్లుల కోసం జాబ్‌కార్డున్న వారు ఫొటోలకు వస్తే క్వార్టర్ మద్యం, భోజనం కూడా ఇస్తున్నట్టు సమాచారం. ఇప్పటి వరకు రూ.4 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు సమాచారం.

నీటి తొట్టెల నిర్మాణంలోనూ చేతివాటం

నీటి తొట్టెల నిర్మాణంలోనూ కూటమి నేతలు చేతివాటం చూపించారు. పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో మూన్నాళ్లముచ్చటగా మారాయి. పల్లెపండుగ పేరుతో నీటి తొట్టెల నిర్మాణానికి పూనుకున్నారు. పుంగనూరు నియోజకవర్గానికి రూ.1.10 కోట్లు కేటాయించారు. పుంగనూరులో 40, చౌడేపల్లెలో 45, సోమలలో 33, సదుంలో 37, పులిచెర్లలో 42, రొంపిచర్లలో 102 నీటి తొట్టెలు నిర్మించారు. ఒక్కొక్క దానికి సుమారు రూ.35 వేలు ఖర్చుచేశారు. తొట్టెల నిర్మాణం పనులను కూటమి నేతలకు కట్టబెట్టారు. తొట్టెలు కట్టి నెలలు గడుస్తున్నా నీటిని నింపిన దాఖలాలు లేవు. కొన్ని ప్రాంతాల్లో పశువులకు ఉపయోగపడే ప్రాంతాల్లో నిర్మించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. చిన్నకొండామర్రి, చిప్పిలివారిపల్లె గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల ముందు తొట్టెలను నిర్మించారు. పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చౌడేపలె: చిప్పిలివారిపల్లెలో నిరుపయోగంగా వున్న నీటి తొట్టె



చౌడేపల్లె: స్కూల్ ఆవరణలో వున్న నీటి తొట్టె



చౌడేపల్లె: మిట్టూరులో చుక్కనీరులేని నీటి తొట్టె

పనులపై దృష్టిసారిస్తాం

"ఉపాధి హామీ కింద చేస్తున్న పనులను పర్యవేక్షిస్తునే వున్నాం. గతంలో చేసిన పనులను మళ్లీ వాహనాలతో చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎవరైనా జేసీబీలతో పనులు చేసినా బిల్లులు పెట్టే ప్రసక్తే లేదు. ఇకపై పూర్తిస్థాయిలో పనులపై దృష్టిసారిస్తాం. అవినీతి, అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. అర్హులైన కూలీలందరికీ పనులు కల్పిస్తాం.

–ఎం.పుష్పలత, ఉపాధి ఏపీవో, పలమనేరు

రేపు చౌడేపల్లెలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

చౌడేపల్లె: మండల కేంద్రమైన చౌడేపల్లెలోని గడ్డంవారిపల్లె రోడ్డులో వున్న బైసాని కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు, మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి తెలిపారు. ఇందులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు న్యాయ సహాయం



హరిక్రిష్టారెడ్డి

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ లీగల్ సెల్ పలమనేరు అధ్యక్షుడు హరిక్రిష్టారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు పలమనేరు ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న తన కార్యాలయంలో సంప్రదించి ఉచిత న్యాయ సేవలు పొందవచ్చన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి వచ్చేందుకు కృషి చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, పట్టణ కన్వీనర్ హేమంత్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

శాకంబరిగా దుర్గాదేవి



శాకంబరిగా దర్శనమిస్తున్న దుర్గాదేవి

పలమనేరు: పలమనేరు పట్టణం పాతపేటలో వున్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

వి.కోట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వి.కోట మండల యూత్ వింగ్‌కు పవన్‌కుమార్, మహిళా విభాగానికి శశికళ, రైతు విభాగానికి రాధాకృష్ణారెడ్డి, బీసీ సెల్‌కు మంజునాథ్, ఎస్సీ సెల్‌కు శివరామ్, ఎస్టీ సెల్‌కు శరత్, మైనార్టీ సెల్‌కు సమద్, స్టూడెంట్ వింగ్‌కు శ్యామ్, పంచాయతీరాజ్ వింగ్‌కు రామచంద్రప్ప, వలంటీర్స్ వింగ్‌కు బాలాజీ, గ్రీవెన్స్ సెల్‌కు సుబ్బు, వాణిజ్య విభాగానికి నాగరాజు, వైఎస్సార్ టీయూసీకి తంగరాజ్, కల్చరల్ వింగ్‌కు క్రిష్టప్ప, సోషల్ మీడియా వింగ్‌కు శివ, ఐటీ వింగ్‌కు హరీష్, ఇంటలెక్చువల్స్ ఫోరమ్‌కు ఇమ్రాన్, పబ్లిసిటీ వింగ్‌కు శశికుమార్‌రెడ్డి, డాక్టర్స్ వింగ్‌కు దయాకర్, బూత్ కమిటీ వింగ్‌కు గంగాధర్ నియమితులయ్యారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి సూచించారు.

రోటరీ ప్రతినిధులుగా నానబాలగణేష్, రాజారెడ్డి



నూతనంగా ఎన్నికైన రోటరీ క్లబ్ ప్రతినిధులు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా నానబాలగణేష్, ప్రధాన కార్యదర్శిగా రాజారెడ్డి, డైరెక్టర్లుగా డాక్టర్లు ప్రభాకర్, విజయకుమారి, శరణ్‌కుమార్, హరగోపాల్, పూలత్యాగరాజు, భాస్కర్, భాస్కర్‌జెట్టి, అనిల్, జాన్, నాగిరెడ్డి, సురేష్, ఆవుల హరిప్రసాద్, ఎస్‌విటి.కిషోర్, మునిరాజా, భాస్కర్‌రెడ్డి, అర్షద్‌అలి, వేణుగోపాల్‌రాజు, రవికిషోర్, కృష్ణకుమార్, సుధాకర్‌రెడ్డి, సత్యాచారి, ప్రవీన్, ఇట్టాశ్రీధర్ తదితరులు ఎన్నికయ్యారు. నానబాలగణేష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరింపజేస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా ప్రతినిధులు చైతన్య, హేమచంద్ర మాగం, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నూతన ప్రతినిధులుగా ఎంపికైన వారికి మాజీ అధ్యక్షులు ఎస్‌విటి. కిషోర్, ఆవులహరిప్రసాద్, పూలత్యాగరాజు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్

వి.కోట: పట్టణంలోని కేపీ వీధిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఒగు పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది పలువురు హమాలీలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ మండల లోడింగ్ అన్ లోడింగ్ హమాలీల అభ్యర్థన మేరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఆయనను హమాలీలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, వార్డు మెంబర్ కుమారరాజా, శశికళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పలమనేరు: పలమనేరు పట్టణంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున మున్సిపాలిటీ, మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని ట్రాన్స్‌కో ఏడీ జీవన్ కుమార్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుప్పం రూరల్: కుప్పంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా కుప్పం, గుడుపల్లె మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం



పుంగనూరు: వేడుకలు జరుపుకుంటున్న కార్మికులు



పలమనేరులో..

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. యూనియన్ అధ్యక్షుడు వెంకట్రమణారెడ్డి మాట్లాడుతూ కార్మికులపై అధికారుల వేధింపులు మానుకోవాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా వున్న 35 వేల కార్మికుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అడవినాథకుంటలోవున్న మోడల్ స్కూల్‌కు వెళ్లే బస్సులు పూర్తిగా దెబ్బతిన్నాయని, మంచి బస్సులు నడపాలని సూచించారు. డిపోలో ఉన్న 35 మంది దినసరి కూలీ డ్రైవర్లను క్యాజువల్ కార్మికుల కింద తీసుకోవాలని కోరారు. జీవి.రమణ, భాస్కర, నాయక్, గంగాధర్ పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఈయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి జెండా ఎగురవేశారు. డిపో అధ్యక్షుడు కె.బాలక్రిష్ణ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి యూని యన్ ఎంతో కృషి చేస్తోందన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు హేమాచలం, సీఐటీయూ సీనియర్ నాయకులు చెన్నకేశవులు, కార్యదర్శి బాషా పాల్గొన్నారు.

17 నుంచి చాముండేశ్వరి జయంతి ఉత్సవాలు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని తూర్పుమొగసాల వద్ద గల శ్రీచాముండేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 17 నుంచి 21 వరకు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు శుక్రవారం జెట్టి కులస్తులు తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవారిని ప్రతి రోజూ ప్రత్యేకంగా అలంకరించి ఊరేగిస్తామని పేర్కొన్నారు. అలాగే భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకాలు



విశేషాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాలంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య రాహుకాలంలో సంప్రదాయంగా అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈవో ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు అందజేశారు.

జనాభా పెరుగుదలతోనే పేదరికం







గంగవరం: ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, సదుం: చెరుకువారిపల్లెలో ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది, రొంపిచెర్లలో..



సోమలలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది



పలమనేరులో..

గంగవరం: జనాభా పెరుగుదలతోనే పేదరికం కలుగుతుందని, కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల ఆర్థిక ఇబ్బందులను అధిగమించవచ్చని వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గంగవరం పీహెచ్‌సీ నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ విషయంలో పురుషుడి పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఒక కుటుంబంలో ఒకరు లేదా ఇద్దరు సంతానం చాలన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ లహరి పాల్గొన్నారు.

ఒక్కరు ముద్దు.. ఇద్దరు హద్దు

సోమల(చౌడేపల్లె): ఒక్కరు ముద్దు.. ఇద్దరు హద్దు.. ఆపై వద్దే వద్దు అని మండల వైద్యాధికారి జయసింహ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు సోమలలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చిన్న కుటుంబం వల్ల అనేక లాభాలు వున్నాయని తెలిపారు. యువకులు 21, యువతులు 18 ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని సూచించారు. ఇద్దరు పిల్లలు జన్మించిన తర్వాత కుటుంబ నియంత్రణను పాటించాలని కోరారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

రొంపిచెర్ల: ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని రొంపిచెర్ల పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రొంపిచెర్లలో జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పాటించినప్పుడే తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణకు అవసరమైన సేవలు పీహెచ్‌సీలో ఉచితంగా అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సదుంలో

సదుం: గర్భం ధరించే మహిళలు మానసికంగా, శారీరకంగా స్థిరంగా ఉన్నప్పుడే బిడ్డ ఆరోగ్యంగా పుడతాడని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యులు చరణ్, గాయత్రి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాన్పుకు, కాన్పుకు మధ్య వ్యవధి పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి, ఆరోగ్య కార్యకర్తలు హేమలత, సరస్వతి, సతాజ్, నాగరత్న, దీప, శివాని, మనీషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక జనాభాతో ఇబ్బందులు

పలమనేరు: అధిక జనాభాతో ఇబ్బందులు తప్పవని పలమనేరు మండల వైద్యాధికారిణి అనౌఖి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కొలమాసనపల్లిలో శుక్రవారం వైద్య, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పలమనేరు మండల, మున్సిపాలిటీ జనాభా లక్షకు చేరిందన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలన్నారు.